

# ధారలుగా కారిన రక్తం వరదలుగా కారిన కన్నీళ్ళు

## – కొమ్మూరి సాంబశివరావు



*(గత సంచిక తరువాయి)*

"**అక్కడే అంటే ఎక్కడ?** మీరూ, సుమిత్రా."

"లేదు, నాకు హాల్లో నేలమీద పరుపు వేశాడు."

"సుమిత్ర?"

"సుమిత్ర, జయశ్రీ అవతల పడకగదిలో పడుకున్నారు."

"పుండరీకాక్షయ్య, ఆయన భార్య?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

పుండరీకాక్షయ్య భార్య కనకమ్మ వంట యింట్లో పడుకుంది. పుండరీకాక్షయ్య సుమిత్ర జయశ్రీల పడకగది ముందు, చాప వేసుకుని పడుకున్నాడు."

"ఊ!" అన్నాడు యుగంధర్.

"ఎందుకు మెలుకువ వచ్చిందో నాకు తెలియదు, ఇంకా తెల్లారకముందే మెలుకువ వచ్చింది. లేచి కూర్చున్నాను. హాలులో దీపం లేదు, పడకగది తలుపు కొద్దిగా తెరచివుంది. ఆ గదిలో వున్న బెడ్‌రూం దీపం వెలుగు కొద్దిగా హాల్లో పడుతూంది. గదిముందు పడుకున్న పుండరీకాక్షయ్య, పడుకుని లేడు. చేతి గడియారం చూసుకున్నాను. దాదాపు అయిదుగంటలు కావస్తోంది. సుమిత్రని నిద్రలేపుదామని అనుకుంటూ పడక గదిలోకెళ్ళాను. ఆ సన్నని వెలుగులో స్పష్టంగా ఏమీ కనిపించలేదు. మంచం దగ్గరకి వెళితే, యిద్దరు స్త్రీలూ ఒకర్నొకరు కావలించుకుని పడుకున్నట్టు కనిపించారు. సుమిత్ర అని స్పష్టంగా కనిపించకపోయినా, కాస్త లావుగా వుంది కనుక, సుమిత్రే అయ్యుండాలని, వీపు తట్టాను మునివేళ్ళతో మెల్లిగా. వేళ్ళకి జిగటగా ఏదో అతుక్కుంది. వెంటనే దీపం స్విచ్ వేశాను. అంతే! గుండె ఆగిపోయినంత పనయింది. రక్తపు మడుగులో పడున్నారు ఇద్దరు స్త్రీలు. దుప్పటి, దిళ్ళు, వాళ్ళ ఒళ్ళు అంతా రక్తమే. ఊపరి చూశాను. పలకలేదు. ప్రాణం లేదనీ, ఇద్దరూ మరణించారనీ తెలిసింది. సుమిత్ర ఛాతీలో ఒక కత్తి దిగబడి వుంది. దాన్ని లాగాను. అది లాగేస్తే సుమిత్ర బతుకుతుందనే పిచ్చి ఆశ. కత్తి లాగగానే, రక్తం నా మీదకి చిమ్మింది. ఇక అరవబోతున్నాను. పుండరీకాక్షయ్యనీ, కనకమ్మనీ పిలవపోతున్నాను.

"ఏమిటది? ఎవరు?" అంటూ పుండరీ కాక్షయ్య గదిలోకి వచ్చాడు, వెనకే కనకమ్మ వచ్చింది.

నన్ను, నా చేతిలో కత్తి, నా బట్టల మీద రక్తం చూసి, ఒక్క గెంతున మంచం దగ్గరకు చేరుకుని, ఇద్దరూ ఒకేసారి అరవడం ప్రారంభించారు. "పాపిష్టి వెధవ ఇద్దర్నీ రాక్షసుడిలా చంపేశావురా" ఏమేమో తిడుతున్నారు. నా స్థితి నాకు అప్పుడూ అర్ధమయింది. ఆ హత్యలు నేను చేశానని అంటున్నారు. నా చేతిలో కత్తి, నా బట్టలమీద రక్తం సాక్ష్యాలు. ఏం చెయ్యాలి? సుమిత్ర పోయిందనే దుఃఖం ఒకవైపు, హంతకుడిగా నన్ను పట్టుకుంటారనే భయం ఒకవైపు, హంతకుడిగా నన్ను పట్టుకుంటారనే భయం ఒకవైపు. పరిగెత్తాను బయటికి. పుండరీకాక్షయ్య పట్టుకోబోయాడు. చిక్కలేదు. పరిగెత్తి, పరిగెత్తి ఒక ఆటో చేసుకుని, ఆళ్వారుపేటలో వున్న మా వకీలు స్వామినాథన్‌గారి యింటికి వెళ్ళాను. నేను చెప్పింది విని, "నేను క్రిమినల్ లాయరుని కాను. కాని ఒక సలహా చెపుతాను. వెంటనే వెళ్ళి పోలీసులకి సరండర్ అయిపో. తర్వాత నీ తరపున నేను క్రిమినల్ లాయర్ని ఏర్పాటు చేస్తాను" అన్నాడు. "ప్లీజ్ మీరు" అంటున్నాను.

"పోనీ ఒక పనిచెయ్యి, డిటెక్టివ్ యుగంధర్ గారి వద్దకు వెళ్ళి ఆయనకి జరిగింది చెప్పు. నువ్వు నిర్దోషివయితే ఆయన నిన్ను రక్షించగలరు" అన్నాడు స్వామినాథన్. యుగంధర్‌గారి చిరునామా ఇచ్చారు అదే ఆటోలో యుగంధర్‌గారింటికి వెళ్ళాను" అని ముగించాడు సత్యం.

"ఆ కత్తి ఏం చేశారు?" అడిగాడు ఇన్‌స్పెక్టర్.

"అక్కడే, ఆ గదిలోనే, పుండరీకాక్షయ్య రాగానే నేలమీద పడేశాను" అన్నాడు సత్యం.

"బాగా జ్ఞాపకం చేసుకోండి. ఒకవేళ ఆ గాభరాలో మీరు తీసుకెళ్ళారా మీతో"

"లేదు" అన్నాడు సత్యం.

సత్యాన్ని అక్కడినించి తీసుకెళ్ళమని స్వరాజ్యరావు సార్జంట్ శివంకి సంజ్ఞ చేశాడు.

సత్యాన్ని తీసుకుని వెళ్ళాక, "హత్యలు జరిగిన గదిలో కత్తిలేదు" అన్నాడు స్వరాజ్యరావు.

"మీ ప్రశ్నని బట్టి అది అర్ధమయింది" అన్నాడు రాజు.

"పుండరీకాక్షయ్య వాఙ్మూలం ఏమని యిచ్చాడు?" అడిగాడు యుగంధర్.

"చదవండి" అని ఇన్‌స్పెక్టర్ రెండు కాగితాలు యుగంధర్ ఇచ్చాడు.

"సత్యం నాకు దూరపు బంధువు. నేను మద్రాసులో రెండేళ్ళ క్రితమే కాపురం పెట్టాను, మా అమ్మాయి జయశ్రీని సినిమాలలో చేర్పించాలని. సంవత్సరం క్రితం మా వూరికి వెళ్ళి వస్తూ, తోవలో సత్యం వూరికి వెళ్ళాను. సత్యాన్ని చూడడానికి కాదు, ఎవరో పిక్చర్ తీస్తాము, డబ్బు పెడతాము అంటే మాట్లాడ్డానికి. బంధువులు కదా అని సత్యం ఇంటికి వెళ్ళాను. సత్యం భార్య సుమిత్రని పెళ్ళిలో చూశాను, అంతే. సుమిత్ర మద్రాసు సినిమా కబుర్లు చెప్పమనేది. తీరికైనప్పుడల్లా

చెప్పేవాణ్ణి. మా అమ్మాయిని ఒకటి రెండు సినిమాల్లో చేర్పించిన విషయము చెప్పాను. తనకీ సినిమాలలో వేయాలని వున్నదనీ, తననీ తీసికెళ్లమనీ అడిగింది. పెళ్ళయి కాపురం చేస్తున్న తనకెందుకు ఆ గొడవ అంటే వినిపించుకోలేదు. సత్యం ఒప్పుకోడు అంటే, అతనికి తెలియకుండా వస్తానన్నది. నిజానికి నాతో రాలేదు. నేను వాళ్ళ వూరినుంచి బయలుదేరిన గంట తర్వాత, ఇంకో బస్సులో బయలుదేరి వచ్చి నన్ను విజయవాడలో కలుసుకుంది. నాతో మద్రాసుకు వచ్చింది. ఎక్కడ సత్యం నామీద లేనిపోని అభాండాలు వేస్తాడో అని, మద్రాసుకి వచ్చిన మర్నాడే, సుమిత్ర నగలన్నీ బాంకులో పెట్టేశాను. సుమిత్రని కూడా సినిమాలలో చేర్పించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాను. ఎలాగో ఇల్లు తెలుసుకుని, సత్యం మా యింటికి వచ్చాడు. సుమిత్రని బతిమాలాడు. నన్ను తిట్టాడు. అతన్ని చూస్తే కాలివేసింది. నేను సుమిత్రకి నచ్చచెప్పి పంపిస్తానన్నాను. కాని సుమిత్ర మొండిపట్టు పట్టింది. వెళ్ళనంది. మళ్ళీ సత్యం రెండుసార్లు వచ్చాడు. సుమిత్ర రానంటోన్నదని, వస్తే తీసుకెళ్ళమని చెప్పాను. నిన్న రాత్రి మళ్ళీ వచ్చాడు భోజనాలవేళ. కోర్టునుంచి "కంజుగల్ రైట్స్" అంటూ భార్యతో కాపురం చేసే హక్కు కోర్టువారు యిచ్చారనీ, సుమిత్రని తీసుకెల్తాననీ చెప్పాడు. నాకు కోర్టునించి ఎప్పుడో నోటీసు వచ్చింది. నేను ఒక వకీలును కలుసుకుంటే, సుమిత్ర తిరిగి వెళ్ళడానికి నేను ఆటంకపరచడం లేదు కనుక. నేను కోర్టుకి వెళ్ళవలసిన అవసరంలేదని చెప్పారు. కోర్టువారు డిక్రీయిస్తారనీ, సుమిత్రని సత్యం తన బలం ఉపయోగించి తీసుకుని పోవచ్చనీ, నేను కాని, మరెవరయినా కాని అటకాయిస్తే మేము నేరస్తులం అవుతాం అని చెప్పారు.

సుమిత్రని సత్యం తనే తీసికెళ్ళకపోతే, అతనికి పోలీసువారు కాని, కోర్టువారు కానీ ఎటువంటి సహాయం చెయ్యలేరనీ చెప్పాడు. కోర్టు డిక్రీ అవసరం లేదనీ, సుమిత్రని ధారాళంగా తీసుకెళ్ళమని చెప్పాను. ఆ రాత్రి, చాలాసేపు, దాదాపు పన్నెండు గంటలవరకూ, భార్యాభర్తలు కీచులాడుకున్నారు. నేనే యిక వెళ్ళిపడుకోమనీ, మర్నాడు పొద్దున్న చర్చించవచ్చనీ చెప్పాను. సత్యం హాల్లో పడుకున్నాడు. పడకగదిలో పడుకున్నారు జయశ్రీ, సుమిత్ర. తెల్లారగట్ట, నాలుగు గంటలకల్లా లేచి, కుక్కని తీసుకుని వాకింగ్‌కి వెళ్ళడం నాకు అలవాటు. అలవాటు ప్రకారం ముందు తలుపు దగ్గరగా వేసి, నేను కుక్కని తీసుకుని వాకింగ్‌కి వెళ్ళాను. తిరిగి వచ్చేటప్పటికి, నా కూతురు జయశ్రీ, సుమిత్రా హత్య చెయ్యబడి వున్నారు. సత్యం చేతిలో కత్తి, గదంతా రక్తం, యింకేం చెప్పాలి?"

"సుమిత్ర నగలు యింకా బాంక్‌లోనే వున్నాయా?

"ఉన్నాయి."

"సత్యం మీకు డబ్బు యిచ్చానన్నాడు పదివేలు?"

"అబద్ధం. పైసా యివ్వలేదు."

"తనతో రానందుకు సుమిత్రమీద సత్యానికి ద్వేషం వుండి, సుమిత్రని హత్య చేశాడనుకుందాం. ఏ కారణం లేనిదే జయశ్రీని ఎందుకు హత్య చేశాడంటారు?

"బహుశా సుమిత్రని కత్తితో పొడుస్తుండగా, జయశ్రీ లేచి చూసి వుంటుంది. తను చేసిన నేరానికి ప్రత్యక్ష సాక్షి కనుక్ అజయశ్రీని కూడా హత్యచేసి వుంటాడు .నేను వచ్చేలోపున, తనకేమీ తెలియనట్టు, పడుకుని నిద్రపోతున్నట్టు నటిద్దామనుకుని వుంటాడు. అంతే నేను వూహించగలను.

"జయశ్రీ, సుమిత్ర ప్రతిరాత్రి ఆ యిద్దరే పడక గదిలో మంచం మీద పడుకుంటారా?"

"అవును."

"ఒంటిమీద నూలుపోగయినా లేకుండా, పూర్తిగా వివస్త్రలయి పడుకోవడంవారికి అలవాటా?"

"అలా ఎప్పుడూ పడుకోలేదు. పడుకోలేదని నాకు తెలుసు. పడకగది తలుపు ఎప్పుడూ లోపల గడియపెట్టుకోరు. అలా పెట్టుకునుంటే సత్యం వారిని హత్య చెయ్యడానికి అవకాశం వుండేది కాదు. హత్య చేసిన తర్వాత సత్యమే వాళ్ళ వొంటి మీద బట్టలు తీసేశాడేమో?"

"కారణం?"

"నాకు తెలియదు."

"అయితే వాళ్ళని బట్టలు వుండగానే పొడిచి చంపి వుండాలి. అంటే వాళ్ళ బట్టలు రక్తంతో తడిసివుండాలి, వాళ్ళ బట్టలన్నీ శుభ్రంగానే వున్నాయి."

"అలాగా!"

"సుమిత్రా, జయశ్రీ అలా వివస్త్రలయి పడుకోవడానికి కారణం వూహించగలరా?"

"చెప్పలేను."

"ఆ యిద్దరి స్త్రీల స్నేహంలో ఏమైనా, వైపరీత్యం మీకు కనిపించలేదా?"

"అటువంటి చిహ్నాలు ఏమీ ఎప్పుడూ కనిపించలేదు."

యుగంధర్ చదివి, కాయితాలు యిన్‌స్పెక్టర్‌కి యిస్తూ "సత్యాని యిందాక మా ముందు ప్రశ్నించడం రెండవసారి అన్నమాట" అన్నాడు.

ఇన్‌స్పెక్టర్ తల వూపి, "ఏమైనా పొరపాటు చెప్తాడేమోనని."

"మొదటి వాగ్మూలానికీ, రెండవసారి ఇచ్చిన వాగ్మూలానికీ తేడా వుందా?"

"లేదు" అన్నాడు యిన్‌స్పెక్టర్.

"నాకు చెప్పిన విషయాలు అవే, సత్యం వాగ్మూలంలో ఏమాత్రం తేడాలేదు" అన్నాడు యుగంధర్.

"అంత మాత్రాన" అంటున్నాడు యిన్‌స్పెక్టర్.

"సత్యం నిరపరాధి అనడంలేదు. చెప్పాను అంతే. మీ యిన్‌వెస్టిగేషన్ ప్రారంభం అయిందా?"

"చేస్తున్నాను."

"గుడ్ కానివ్వండి. నేనూ పరిశోధన చేస్తాను. కొత్త విషయాలు తెలిస్తే చెప్తాను" అన్నాడు యుగంధర్.

5

యుగంధర్, రాజు, కాత్యాలు కన్సల్టింగ్ రూములో కూర్చున్నారు. ఆనాటి పత్రికలు తిరగేస్తోంది కాత్యా. హత్య జరిగిన గది ఫోటోలు, రక్తపు మరకల ఫోటోలు, జయశ్రీ సుమిత్రల ఫోటోలు కాక హత్యని గురించిన వివరాలు పత్రికా విలేఖరులు చిలువలూ పలవలూ కల్పించి వ్రాశారు. "ధారలుగా కారిన రక్తం, వరదలుగా కారిన కన్నీరు" అని కొందరు, "వరదలుగా కారిన రక్తం, ధారలుగా కారిన కన్నీరు" అని మరికొందరు వ్రాశారు. చాలా దారుణమైన రెండు హత్యలు అని ఏకగ్రీవంగా అందరూ అంగీకరించారు.

"అవును దారుణమైన హత్యలు. హంతకుడికి ఆ యిద్దరి మీదా చాలా ద్వేషమూ, కసీ వుండుండాలి. లేకపోతే అలా, అన్ని కత్తిపోట్లు పొడవడు" అన్నాడు యుగంధర్.

"సత్యం చెప్పిన విషయాలు నిజమైతే, హంతకుడు గదిలోకి ఎలా వచ్చాడు? కత్తి ఏమైంది? ఎలా వెళ్ళాడు? అన్ని కత్తిపోట్లు పొడుస్తున్నా ఆ యిద్దరూ చిన్న కేక కూడా ఎందుకు వెయ్యలేదు?" అన్నాడు రాజు.

"అదొక్కటే కాదు, ఆ యిద్దరు స్త్రీలు వివస్త్రలుగా ఎందుకు పడుకున్నారు? గాలికేనా? గదిలో ఫాన్ వున్నదని యీ ఫోటోని బట్టి తెలుస్తోంది. కరెంటు పోలేదని సత్యం వాగ్మూలం వల్ల తెలుస్తోంది" అన్నది కాత్యా.

"సుమిత్ర తనతో రానంటే, కసికొద్దీ సత్యం ఆమెని చంపాడనుకోవచ్చు, కాని యిద్దర్నీ ఎందుకు చంపాడు? పుండరీకాక్షయ్య వాదన అంగీకరించలేను. సుమిత్రని కత్తితో పొడవడం జయశ్రీ చూసి వుంటే వెంటనే కేకవేసేది. ఈ కేసులో చాలా మారాముళ్ళున్నాయి. పైకి కనిపిస్తున్నంత సులభమైన కేసు కాదు" అన్నాడు యుగంధర్.

"మనం" అంటున్నాడు రాజు.

"పరిశోధన ప్రారంభించాలి. హత్యకి ఉపయోగించిన కత్తి కోసం మనం వెతకనవసరంలేదు. ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి ఆ పని వదిలి వెయ్యవచ్చు. పుండరీకాక్షయ్య రోజూ తెల్లారగట్ట నాలుగు గంటలకి, కుక్కని తీసుకుని వాకింగ్‌కి వెళతాడా? వెళ్ళి సామాన్యంగా ఎన్ని గంటలకి వస్తాడు? ఈ విషయాలు నువ్వు కనుక్కోవాలి రాజూ" అన్నాడు యుగంధర్.

కాత్యావైపు చూసి, "నీకూ పనున్నది. జయశ్రీ సినిమాలలో వేస్తోంది. ఏ ఏ సినిమాలలో ప్రస్తుతం నటిస్తోంది? ఆమెకి ఆప్తులు, అంటే ప్రియులు ఎవరన్నా వున్నారా? సుమిత్ర యింకా నటించడం ప్రారంభించలేదు కాని, సినిమా

ప్రపంచానికి సన్నిహితం అయింది. ఆమె విషయం
తెలుసుకో. అంతేకాదు వారి సంపాదన ఏమైనా వుందా? అదీ కనుక్కో" అన్నాడు.

రాజు, కాత్యాలు గదిలోంచి వెళ్ళిపోయారు.

యుగంధర్ ఆలోచిస్తూ కూర్చున్నాడు. టెలిఫోన్ మోగింది.

"హల్లో యుగంధర్ స్పీకింగ్"

"నా పేరు రాధ. యుగంధర్‌గారూ మీరు నన్ను రక్షించాలి" చాలా భయంతో అన్న మాటలు.

"నువ్వు ఎవరమ్మా? ఎక్కడున్నావు? ఎవర్నించి, దేనినించి రక్షించాలి?"

"నా పేరు రాధ. నా యిల్లు ఆళ్వారుపేట, 9వ వీధిలో వుంది .నెం. 292. వెంటనే రాగలరా! నేను పబ్లిక్ కాల్ ఆఫీస్‌లోంచి ఫోన్ చేస్తున్నాను."

"ఆపదలో వుంటే వెంటనే పోలీస్‌స్టేషన్‌కి వెళ్ళమ్మా"

"యుగంధర్‌గారూ ఈరోజు పత్రికలో చూశాను జయశ్రీ హత్య గురించి దర్యాప్తు చేస్తున్నారని. మీకు కొన్ని విషయాలు చెప్పగలను."

"అయితే వస్తున్నాను" అన్నాడు యుగంధర్.

వెంటనే యుగంధర్ క్రిజ్లర్ కారులో బయలుదేరాడు. ఆళ్వారుపేటలో, ఆ వీధి, ఆ నెంబరు యిల్లు తెలుసుకునేందుకు అరగంట పట్టింది అది ఒక చిన్న యిల్లు. మేడకూడా వుంది. ముందు గుమ్మం దగ్గర ఎవరో ఒక మధ్య వయస్కురాలు కూర్చునున్నది.

"రాధ అనే అమ్మాయి"

"మేడమీద వుంది. మెట్లు అటు" అందామె. మెట్లు వెనకవైపు నుంచి వున్నాయి. యుగంధర్ మెట్లు ఎక్కి పైకి వెళ్ళాడు. తలుపు మూసి వుంది తలుపు తట్టాడు. ఎవరూ వచ్చి తలుపు తియ్యలేదు. మళ్ళీ తట్టాడు. నిశ్శబ్దం. తోశాడు తెరుచుకుంది. ఒకే ఒక చిన్నగది. ఆ గదికి అవతల వంటయిల్లు. ఆ గది మధ్యన మంచం. మంచం మీద పడివున్నది ఒక అమ్మాయి.

ఒంటిమీద నూలుపోగు లేదు. ఒంటినిండా కత్తిపోట్లు. రక్తం ధారలుగా కారి, దుప్పటంతా తడిసి, మంచం మీదనుంచి చుక్కలు చుక్కలుగా కిందకి కారుతోంది. ఇరవై ఎళ్ళుంటాయి. అందమైన యువతి. ఎన్నో హత్యలు, ఎన్నో ఘాతక చర్యలు, ఎంతో రక్తపాతాన్ని చూసిన యుగంధర్ ఆ దృశ్యం చూడలేక, వెనక్కి తిరిగాడు.

"అమ్మా!" అని పిలిచాడు యుగంధర్ గుమ్మం దగ్గర కూర్చున్న స్త్రీని.

"ఆ! ఏమిటి?" అని అడిగింది విసుగ్గా.

"మీరు ఎంతసేపట్నించీ యిక్కడ కూర్చున్నారు?" అడిగాడు.

"మీకెందుకు?" "బహుశా మీరు యీ యింటివారనుకుంటాను. మేడమీద కాపురమున్న రాధని కలుసుకోవడానికి నేను వచ్చే ముందు ఎవరయినా వచ్చారా?" అడిగాడు.

"చూడండయ్యా ఆ రాధ అలాంటిది అని నాకు తెలియక బుద్ధిలేక యిల్లు అద్దెకిచ్చాను. అడ్డమైన మొగాళ్ళు రాత్రిపగళ్ళు వచ్చి వెళ్ళేవారే. ఎవరు, ఎప్పుడు పైకి వెళుతున్నారో చూస్తూ కూర్చోవడం నా పనికాదు" అన్నదమె.

"అమ్మా! ఆ అమ్మాయి రాధ నీతిపరురాలు కాకపోవచ్చు. కాని, ఆమెను ఎవరో ఘాతుకంగా హత్య చేశారు. అందువల్ల అడిగాను" అంటున్నాడు.

"అమ్మో! హత్యే! బాబోయ్ అప్పుడే తెలుసు, ఇల్లు ఖాళీచెయ్యమని" యుగంధర్ యిక అక్కడ వుండి ప్రయోజనం లేదనుకుని బయలుదేరి దగ్గరున్న టెలిఫోన్ బూత్‌నించి, ఇన్‌స్పెక్టర్ స్వరాజ్యరావుకి ఫోన్ చేశాడు.

## ( కొనసాగింపు వచ్చే నెలలో)

Post your comments